క్లుప్తంగా

పన్ను వసూళ్ల కేంద్రాలను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : సెలవు దినాల్లో సైతం నగరపాలకలో ఆస్తి పన్ను వసూళ్ల కేంద్రాలు పనిచేస్తాయని, ఈ అవకాశాన్ని పన్నుదారులు వినియోగించుకోవాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు కోరారు. శుక్రవారం స్థానిక నగరపాలకలోని పన్ను వసూలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బకాయిలు ఏకమొత్తంలో చెల్లించిన పన్నుదారులకు వడ్డీ మాఫీ ఉంటుందని చెప్పారు. ఆదివారం, రెండో శనివారంతో పాటు హోలీ, గుడ్ ఫ్రైడే పండుగ దినాల్లో కూడా పన్ను కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు.

10న 'మనకు తెలియని మన చరిత్ర'పై సమావేశం

కర్నూలు (అర్బన్) : ఈనెల 10వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక యునాని మెడికల్ కళాశాలలో 'మనకు తెలియని మన చరిత్ర' అనే అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి తెలిపారు. పల్లె పల్లెకు బాంసెఫ్ – మూల నివాసి బహుజన సిద్ధాంత ప్రచారంలో భాగంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యమకారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్‌లో నేటి నుంచి రెండు రోజుల (9,10 తేదీల్లో) పాటు 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన లోగోను శుక్రవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని గురుదత్త పాలీ క్లినిక్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. కర్నూలులో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించడం శుభపరిణామమని, క్రీడాకారులు ఇటువంటి అవకాశాన్ని వినియోగించుకుని ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, చిన్నసుంకన్న పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో శనివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమిరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులు తెలిపారు. ఈ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 94413 12075, 96401 18716 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధి కారులు తెలిపారు. డ్యాంలో 0.143 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించండి



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో ఉన్న వాల్మీకులకు ప్రధాన రాజకీయ పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వాల్మీకి/ బోయ సేవా సంస్థ అధ్యక్షులు తలారి కృష్ణానాయుడు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రెండు జిల్లాల్లో రెండు పార్లమెంట్, ఒక్కో జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. ఆయా రాజకీయ పార్టీలు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన మేధావి, యువతకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ప్రస్తుతపరిస్థితుల్లో సామాజిక వర్గాల సమీకరణలు, కేటాయింపుల్లో అధిక జనాభా కలిగిన వారికి అన్యాయం చేస్తున్నాయన్నారు. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన అధినేతలు వాల్మీకి సామాజిక వర్గానికి న్యాయం చేసేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కుబేరస్వామి, బేతం కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కైలాసవాస..సదాశివ



ప్రత్యేక అలంకరణలో సాయి ఈశ్వరుడు



జగన్నాథగట్టుపై రూపాల సంగమేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో రూపాల సంగమేశ్వరుడు

- శైవాలయాల్లో మార్మోగిన శివనామస్మరణ
- పోటెత్తిన భక్తజనం
- భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, హోమాలు నిర్వహణ
- నగరంలో ఘనంగా శివరాత్రి వేడుకలు

కర్నూలు కల్చరల్: ఓం నమః శివాయ.. శివాయ నమః అంటూ భక్తులు శివుడిని దర్శించుకొని పరవశం చెందారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని తరలివచ్చిన భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. అభిషేక ప్రియుడైన భోళా శంకరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. రాత్రి శైవాలయాల వద్ద భక్తులు జాగరణ చేస్తూ లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవ వేడుకలను వీక్షించారు. ఆది దంపతులైన శివపార్వతులను దర్శించుకొని తరించారు. లింగాష్టకం, శివ పంచాక్షరి జపించారు. దీపారాధన చేస్తూ శివారాధనలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు, ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రూపాల సంగమేశ్వర సన్నిధిలో లక్షలాది భక్తులు

నగరశివారులోని జగన్నాథ గట్టు శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత రుద్రాభిషేకం, ప్రత్యేక పాలాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. రూపాల సంగమేశ్వరుని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తరించారు. దిన్నెదేవరపాడు గ్రామస్తులతో నిర్వహించిన ప్రభోత్సవ వేడుక విశేషంగా ఆకట్టుకుంది. లింగోద్భవ అభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకీ సేవ కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. దిన్నెదేవరపాడు గ్రామ పెద్ద పెరుగు సీతారామిరెడ్డి కుమారులు పురుషోత్తంరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, అన్నదానం నిర్వహించారు. నాట్యవేద కూచిపూడి కళానిలయం, విజ్ఞాన పీఠం పాఠశాల విద్యార్థులతో ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు, హరికథ, భజన, కార్యక్రమాలు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా రూపాల సంగమేశ్వరాలయం సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. వీరికి ఆలయ ఈఓ, అభివృద్ధి సమితి సభ్యులు స్వాగతం పలికారు. ఆలయం ఈఓ, అసిస్టెంట్ కమీషనర్ ప్రసన్నలక్ష్మి, ఉత్సవాల ప్రత్యేక అధికారి గుర్రెడ్డి, తాలూకా సీఐ శ్రీధర్, రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, క్రిష్టన్న, కోశాధికారి వాసుదేవయ్య, ఉపాధ్యక్షులు దమోదర్‌రెడ్డి, మహేష్ పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జగన్నాథ గట్టుపై శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ప్రసన్నలక్ష్మి వెల్లడించారు.

- కర్నూలు నగరంలో సప్తగిరి కైలాసగిరి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వరాలయం, లలితా పీఠం, నెహ్రూ నగర్‌లోని సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామనగర్, బుధవారపేటల్లోని శివాలయాలు, సూర్యనారాయణ స్వామి ఆలయం, సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ఈఓ ప్రసన్నలక్ష్మి, కమిటీ సభ్యులు



సూర్యనారాయణస్వామి ఆలయంలో రుద్రహోమం దృశ్యం



లలితాపీఠంలో గోపూజ ..



రూపాల సంగమేశ్వరుడి దర్శనానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు,వైఎస్ఆర్‌సీపీ కర్నూలు ఇన్‌చార్జ్ ఇంతియాజ్

జగనన్నకు బాసటగా నిలవండి

- న్యాయవాదులతో వైఎస్ఆర్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్



న్యాయవాదులతో సమావేశమైన ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు న్యాయవాదులు బాసటగా నిలవాలని కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్వీ స్వగృహంలో పలువురు న్యాయవాదులు ఇంతియాజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధి కోసం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించారన్నారు. ఇప్పటికే మానవ హక్కుల సంఘం, లోకాయుక్తా కర్నూలుకు వచ్చాయన్నారు. న్యాయ కళాశాల పనులను ముఖ్యమంత్రి త్వరలో శంకుస్థాపన చేసి ప్రారంభిస్తారన్నారు. గత ప్రభుత్వం న్యాయవాదులను వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు అందిస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వం వైఎస్ఆర్ కాంగ్రెస్ అన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులు అధిగమించడం కోసం వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాయలసీమ న్యాయవాదుల కోరిక మేరకు హైకోర్టును కర్నూలుకు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- మహిళా దినోత్సవం వేడుకల్లో వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం నాయకులు



వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ తదితరులు

కర్నూలు (టౌన్) : మహిళల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్‌బాషా అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని నామినేటెడ్ పదవుల్లో 60 శాతం మహిళలకు కేటాయించి ఆయన చరిత్ర సృష్టించారన్నారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా రాణించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఏనాడు మహిళలను పట్టించుకోలేదని విమర్శించారు. 14 సంవత్సరాలు పనిచేసిన చంద్రబాబు ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. ఓటు బ్యాంకు కోసం మాత్రమే వాడుకున్నారన్నారు. జగనన్న వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో 33 లక్షల మంది మహిళలకు వారి పేరు మీద ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, అమ్మ ఒడి ఇలా ప్రతి పథకంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రీజినల్ అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలు పాటు రాష్ట్రంలో మహిళా సాధికారిత సాగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకునేందుకు మహిళా లోకం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కో– ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ శిరోమణి మద్దయ్య, మహిళా విభాగం నాయకురాళ్లు నాగేశ్వరి, నాగవేణి రెడ్డి భారతి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి

కర్నూలు (టౌన్) : క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్ జగన్ సర్కారు విశేష కృషి చేస్తోందని ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి అన్నారు.వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో క్రిస్టియన్ మైనార్టీల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం పాస్టర్లకు రూ.5 వేలు గౌరవ వేతనం అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో కర్నూలు నగర పాస్టర్ల సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే సీఎస్ఐ చర్చికి సంబంధించి సమాధుల తోట మంజూరు చేయించినట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపునకు క్రైస్తవ మైనార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శివాలయంలో వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని అశోక్ నగర్ శివాలయంలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అందరికీ జీవనశైలి, మన ఆరోగ్యం–గృహవైద్యం గురించి, ఈ వేసవిలో వ్యాధులకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కె. సత్యం, పి. ఆంజనేయులు, పి. సాయికిరణ్, కాంపౌండర్ ఆర్. మంగమ్మ పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐదవ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఒరిజినల్ ఆధార్ కార్డుతో గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

10న బండలాగుడు పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నాగలింగేశ్వర, కేశవస్వామి జాతరను పురస్కరించుకుని ఈ నెల 10న ఆదివారం జిల్లా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు శుక్రవారం సర్పంచు వెంకటేశ్వరమ్మ తెలిపారు.

సమాజానికి వెలుగు అతివలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకల్లో ఉద్యోగినులు

కర్నూలు(హాస్పిటల్): మహిళలు సమాజానికి వెలుగు అని వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలు లేని జీవితం ఊహించలేనిదని చెప్పారు. ఆసుపత్రుల్లో నర్సులు వృత్తినే దైవంగా భావించి రోగులకు సేవ చేస్తున్నారన్నారు. సమాజంలో ప్రతి స్త్రీ మూర్తిని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ విజయమనోహరి మాట్లాడుతూ ఇంటా బయటా స్త్రీని గౌరవించబడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ మంజులబాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 వెంకటతులశమ్మ, గ్రేడ్–2 సావిత్రిబాయి, నాగమణి, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో....

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీపీఎంఓ డాక్టర్ ఉమా మాట్లాడుతూ స్త్రీ లేకపోతే సృష్టే లేదన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి అరుణ, డెమో ప్రమీలమ్మ, ప్రాంతీయ శిక్షణ కేంద్రం, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో...

కర్నూలు(సెంట్రల్): స్థానిక సీపీఐ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రావణి రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయిన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మహిళలను చిత్రహింసలకు గురి చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు రేణుక, మహేష్ పాల్గొన్నారు.

మహిళా రైతులకు సత్కారం

కర్నూలు(అగ్రికల్చర్): నగర శివారులోని పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పరదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్(పీపీఎల్), పసుపల పీఏసీఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్తమ మహిళా రైతులు పుష్పావతమ్మ, వెంకటలక్ష్మమ్మ, గోవిందమ్మ, లక్ష్మిదేవి, సుహాసినిలను సత్కరించారు. అనంతరం పీఏసీఎస్ సీఈవో మురళీధర్ చౌదరి మాట్లాడుతూ....వ్యవసాయంలో మహిళా రైతులను పీఏసీఎస్, పీపీఎల్ ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పీపీఎల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకేసారి ఇద్దరికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్



కిడ్నీ మార్పిడి జరిగిన రోగులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమలోనే తొలిసారిగా కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో శ్వాప్ పద్ధతిలో ఇద్దరికి కిడ్నీల మార్పిడి ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. వివరాలను ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ అనంతరావు వివరించారు. 'ఏ పాజిటివ్ గ్రూపు రక్తం ఉన్న దైవప్రసాద్ కర్నూలులో పోలీస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఏడాది క్రితం కిడ్నీ విఫలమైంది. కానీ ఆయన భార్యకు బి. పాజిటివ్ రక్తం ఉండటంతో ఆమె నుంచి కిడ్నీ తీసుకోవడం కుదరలేదు. దాంతో ఆయనకు శ్వాప ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించి వివరించాము. రెండో రోగి వెంకటకొండయ్య. బి. పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కలిగిన ఆయనకు ఆరు నెలల క్రితం డయాలసిస్ మొదలైంది. మొదట ఆయన భార్య కిడ్నీ ఇస్తానని చెప్పినా తర్వాత ఆమె కిడ్నీ దానానికి అనర్హురాలని తేలింది. తర్వాత ఏ పాజిటివ్ గ్రూపు రక్తం ఉన్న ఆయన తల్లి ముందుకొచ్చింది. అప్పుడు ఆ ఇద్దరి మధ్య శ్వాప్ ట్రాన్స్‌ప్లాంట్ చేయాలని భావించి ఇద్దరితోనూ చర్చించగా సరేనన్నారు. ఇందుకు సంబంధించి ప్రక్రియ మొత్తం పూర్తి చేసి గత జనవరి 30వ తేదీన కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాము. దాదాపు 20 మంది వైద్య సిబ్బంది సమన్వయంతో 12 గంటల పాటు శ్రమించి ఆపరేషన్లు చేశారు. ఇద్దరు రోగులు, వారి కిడ్నీ దాతలు ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. కోలుకుని నెలతర్వాత ఆసుపత్రికి చికిత్స కోసం రావడంతో సక్సెస్ మీట్ నిర్వహించాము. శస్త్రచికిత్స నిర్వహించిన వారిలో తనతో పాటు డాక్టర్ సురేష్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు డాక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ దుర్గాప్రసాద్, అనెస్తెటిస్టులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ అక్బర్, డాక్టర్ స్వాతి ఉన్నారు. ఇలా శ్వాప్ ట్రాన్స్‌ప్లాంట్ చేయడం కర్నూలులోనే కాక రాయలసీమలోనే ఇదే మొదటిసారి' అని ఆయన వివరించారు.

రైల్వే వ్యాగన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్) : కేంద్ర ప్రభుత్వం పంచలింగాల దగ్గర 227 ఎకరాల్లో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. పంచలింగాల దగ్గర జరుగుతున్న పనులను శుక్రవారంవారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..2019 నాటికే రైల్వే వ్యాగన్ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉన్నా నేటికి పూర్తి చేయలేదన్నారు. రైల్వే వ్యాగన్‌నిర్మాణం పూర్తి అయితే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు.